www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 12 మార్చి 2024



జెసి రామ్‌సుందర్‌రెడ్డి బదిలీ

కొత్త జెసిగా ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్న ప్రవీణ్ ఆదిత్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. రామ్‌సుందర్‌రెడ్డి జాయింట్ కలెక్టర్‌గా సుమారు సంవత్సర కాలం నుంచి పని చేస్తున్నారు.



రామ్‌సుందర్‌రెడ్డి



ప్రవీణ్‌ఆదిత్య

'దాహం'తో దొంగాట..!

తాగునీటిపై వైసిపి, టిడిపి జిల్లా ప్రజానీకంతో దొంగాట ఆడుతున్నాయి. గుక్కెడు నీళ్లివ్వండి మహాప్రభో అంటున్న ప్రజానీకాన్ని ఇరుపార్టీలు తీవ్రంగా వంచించిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల్లో ఓట్లు కోసం హామీలు గుప్పిస్తూ గెలిచిన తర్వాత తాగునీరు అందించేందుకు కనీస చర్యలు సైతం తీసుకోని పరిస్థితి నెలకొంది. వైసిపి, టిడిపి జిల్లా ప్రజానీకాన్ని మోసగించడంతో పదేళ్లుగా కలుషిత నీటినే జనం తాగడం.. లేక డబ్బులు వెచ్చించి తాగునీరు కొనుగోలు చేయడం తప్ప ప్రజలకు వేరే దిక్కులేకుండా పోయింది. జిల్లా ప్రజానీకం దాహం తీరుస్తామని వైసిపి, టిడిపి మోసం చేసిన తీరు అందరిలోనూ చర్చనీయాంశంగా మారింది.



తాగునీటి కోసం రెండు జిల్లాల ప్రజలు అగచాట్లు

ఆక్వా చెరువులతో తాగునీరు పూర్తిగా కలుషితం

2019 ఎన్నికల్లో వైసిపి చెప్పిన వాటర్‌గ్రిడ్ పథకం తూచ్

2014 ఎన్నికల్లో టిడిపి ఇచ్చిన హామీ బుట్టదాఖలే

జిల్లా ప్రజల దాహం కేకలు తీరెదెప్పడంటూ ప్రశ్నిస్తున్న జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా చేపల చెరువుల తవ్వకాలు సాగించిన పరిస్థితి. చెడు వ్యర్థాలు, పురుగుమందు కలిసిన ఆక్వా చెరువుల్లో నీటిని పంటకాలువల్లోకి యధేచ్ఛగా వదిలేస్తున్నారు. దీంతో రెండు జిల్లాల్లో తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. రెండు జిల్లాల్లో దాదాపు 35 లక్షలకుపైగా జనాభా తాగునీటి కోసం నానా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా డెల్టా గ్రామాల్లో గుక్కెడు నీళ్ల కోసం జనాలు అల్లాడుతున్నారు. ప్రతి ఎన్నికల్లో తాగునీటి సమస్యపై ప్రధానంగా రాజకీయ పార్టీలు మాట్లాడుతున్నప్పటికీ గెలిచిన తర్వాత మాత్రం పక్కన పెట్టేస్తున్న పరిస్థితి ఉంది. 2019 ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటు చేసి గోదావరి నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు అందిస్తామని జగన్ జిల్లా ప్రజలకు హామీ ఇచ్చారు. పాదయాత్రలో భాగంగా ఈ నీళ్ల మనుషులు తాగుతారా అంటూ బాటిల్‌లో పోసిన నీరును బహిరంగ సభల్లో చూపించేవారు. అధికారంలోకొచ్చి ఐదేళ్లు పూర్తయిన ఇప్పటికీ వాటర్‌గ్రిడ్ పథకం అడుగు ముందుకు పడలేదు. అధికారంలోకివచ్చిన వెంటనే రూ.3,200 కోట్లతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటు చేస్తున్నట్లు హడావుడి చేశారు. తర్వాత డెల్టాప్రాంతానికి మాత్రమే పరిమితం చేస్తూ రూ.1400 కోట్లతో ప్రణాళికలు రచించినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ ఏదీ జరగలేదు. ఇప్పటికీ కొనుగోలు చేస్తే తప్ప జిల్లా ప్రజానీకానికి దాహం తీరని పరిస్థితి కొనసాగుతూనే ఉంది. ప్రతిరోజూ తాగునీటి కోసం ప్రతి కుటుంబం రూ.20కు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రతినెల పాలు బిల్లులా తాగునీటి కోసం డబ్బులు చెల్లించాల్సిన దుస్థితిలో జిల్లా ప్రజానీకం ఉన్నారు. 2014 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ రోజుకు 20 లీటర్లు రక్షిత తాగునీరు ఉచితంగా అందిస్తామని టిడిపి చెప్పింది. అధికారంలోకి వచ్చాక చాలాకాలం ఆ మాటే మరిచిపోయింది. తీవ్ర విమర్శలు రావడంతో ఎన్‌టిఆర్ సుజల స్రవంతి తాగునీటి పథకం తెరపైకి తెచ్చింది. ఉండి, ద్వారకాతిరుమల వంటి మండలాల్లో కొన్ని పాత వాటర్‌ప్లాంట్లకు రంగులు వేసి హడావుడి చేయడం తప్ప తాగునీరు అందించలేదు.

ఈ ఎన్నికల్లో ఇంకేమి కబుర్లు చెబుతారో..?

వైసిపి, టిడిపి రెండు పార్టీలు తాగునీటిపై జిల్లా ప్రజానీకాన్ని మోసగించాయి. ఇచ్చిన హామీని రెండు పార్టీలూ నెరవేర్చలేదు. ఇప్పటికీ ప్రజలు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఈ ఎన్నికల్లో తాగునీటిపై ఏం మోసపూరిత కబుర్లు చెబుతారోనే చర్చ జనాల్లో సాగుతోంది. తాగునీటి విషయంలో జిల్లా ప్రజానీకాన్ని రాజకీయ పార్టీలు మోసగిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాగేందుకు గుక్కెడు నీటిని ప్రభుత్వాలు అందించలేకపోవడం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. తాగునీటి సమస్యపై ఇరుపార్టీల మోసాలను చూసిన ప్రజలు ఈ ఎన్నికల్లో ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాలి.



జనసేన గూటికి రామాంజనేయులు

పవన్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్న అంజిబాబు

భీమవరం నుంచి భారీ ర్యాలీతో మంగళగిరికి..

భీమవరం నుంచి జనసేన తరపున పోటీకి అవకాశం

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) జనసేన గూటికి చేరనున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన కండువా కప్పుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. భీమవరం నుంచి భారీ ర్యాలీతో మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయానికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం పవన్ కళ్యాణ్ అంజిబాబుకు పార్టీ కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. అంజిబాబు 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి, 2014 ఎన్నికల్లో టిడిపి తరపున భీమవరం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. పదేళ్లపాటు ఎంఎల్ఎగా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో టిడిపి నుంచి బరిలో నిలిచిన ఆయన ముక్కోణ పోటీలో పరాజయం పొందారు. అయితే గత కొంతకాలంగా అంజిబాబు టిడిపికి దూరంగా ఉన్నారు. ఇటీవల టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో అంజిబాబు టిడిపిలోకి రియంట్రీ ఇచ్చారు. అప్పటినుంచి టిడిపిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూనే జనసేనతో తస్సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మారిన సమీకరణాలతో జనసేన నుంచి పోటీ చేస్తున్నట్లు అన్యూహంగా అంజిబాబు పేరు తెరపైకొచ్చింది. ఇటీవల పవన్ కూడా భీమవరంలో పర్యటించి అంజిబాబు ఇంటికెళ్లి పార్టీలోకి ఆహ్వానించినట్లు ప్రచారం సాగింది. దీంతో భీమవరం నుంచి పవన్ పోటీ చేస్తారన్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడింది. ఇదిలా ఉంటే ఇటీవల మంగళగిరిలో పవన్ భీమవరం జనసేన నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశానికి అంజిబాబును ఆహ్వానించడంతో దాదాపుగా ఆయన భీమవరం నుంచి పోటీ చేసేందుకు మార్గం సుగమమైంది. దీంతో అంజిబాబు పోటీ చేసేందుకు అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నట్లు తెలిసింది. అంజిబాబు పార్టీ కండువా కప్పుకున్న మరుక్షణమే భీమవరం టికెట్ కూడా ప్రకటించనున్నట్లు ప్రచారం సాగుతోంది.

జనసేనలో చేరుతున్నా : అంజిబాబు

జనసేన అధిష్టానం నుంచి తనకు పిలుపు వచ్చిందని భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చెప్పారు. తన స్వగృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక మల్టీప్లెక్స్ నుంచి జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, సీనియర్ నేత కనకరాజు సూరి, చనమల్లు చంద్రశేఖర్‌తో పాటు అనుచరులతో 100 కార్లలో ర్యాలీగా మంగళగిరి జనసేన కార్యాలయానికి బయలుదేరనున్నట్లు చెప్పారు. అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో మధ్యాహ్నం 12 గంటలకు జనసేనలో చేరుతున్నట్లు తెలిపారు. భీమవరం నుంచి పవన్ కళ్యాణ్ పోటీ చేయకపోతే తనకు అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

ఎసిబి వలలో ఎస్ఐ, రైటర్, హోంగార్డు

సినీఫక్కీలో పారిపోతున్న ఎస్ఐను ఛేజ్ చేసి పట్టుకున్న ఎసిబి అధికారులు



వివరాలు వెల్లడిస్తున్న ఎసిబి అధికారులు

ప్రజాశక్తి - నరసాపురం

సాధారణంగా పోలీసులు దొంగలను తరుముతారు.. అయితే యూనిఫామ్‌లో ఉన్న పోలీసు అధికారి మోటారు సైకిల్‌పై రయ్యిన దూసుకెళ్లిపోతుంటే.. మఫ్టీలో ఉన్న ఎసిబి అధికారులు ఛేజ్ చేసి పట్టుకున్న తీరు సినిమా షూటింగ్‌ను తలపించింది. ఇదీ నరసాపురం పట్టణంలో సోమవారం చోటుచేసుకున్న ఘటన. దీనికి సంబంధించి ఎసిబి ఇన్‌ఛార్జి డిఎస్‌పి శ్రీహరిరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పట్టణ పోలీస్ స్టేషన్లో విజయవాడకు చెందిన బి.విజయ్‌సాగర్‌పై వరకట్నం వేధింపుల కేసు ఇటీవల నమోదైంది. అయితే ఈ కేసును మాఫీ చేసేందుకు పట్టణ ఎస్ఐ బిఎస్‌డిఆర్.ప్రసాద్ రూ.25 వేలు లంచం డిమాండ్ చేశారు. అయితే సాగర్ తన తండ్రి పోలీసు శాఖలోనే పని చేస్తున్నారని చెప్పినా లంచం ఇవ్వాల్సిందేనని ఎస్ఐ పట్టుబట్టారు. దీంతో సాగర్ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ముందస్తు వ్యూహం ప్రకారం సోమవారం లంచం సొమ్ము రూ.25 వేలు ఇచ్చేందుకు సాగర్ పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నాడు. అయితే అక్కడొద్దని స్టేషన్ పక్కనే రోడ్డుపై జీపు ఆపి అక్కడకు రమ్మని ఎస్ఐ సాగర్‌కు చెప్పారు. సాగర్ అక్కడకు చేరుకుని సొమ్ము ఇవ్వబోతే జీపు డ్రైవర్ అయిన హోంగార్డు ప్రసాద్‌కు ఇవ్వాలని చెప్పారు. ఆ సమయంలో ఎస్ఐతోపాటు రైటర్ జోగి నాగేశ్వరరావు అక్కడే ఉన్నారు. డ్రైవర్ సొమ్ము సాగర్ వద్ద నుంచి తీసుకుని జీపులో పెడుతుండగా ఎసిబి అధికారులు దాడి చేశారు. ఇది గమనించిన ఎస్ఐ, రైటర్, జీపు డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యారు. అప్రమత్తమైన ఎసిబి అధికారులు రైటర్ నాగేశ్వరరావును పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ అటువైపు రోడ్డుపై మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని లిఫ్ట్ అడిగి పాలకొల్లు రోడ్డు వైపు వెళ్లిపోయారు. ఎసిబి అధికారులు ఆయనను వెంబడించి మార్కెట్ యార్డు సమీపంలో పట్టుకున్నారు. ఎస్ఐ యూనిఫామ్‌లో ఉండటం, ఎసిబి అధికారులు సివిల్ డ్రెస్‌లో ఉండటంతో జనం ఏం జరుగుతుందా అని ఉత్కంఠగా చూశారు. తర్వాత ఎసిబి అధికారులని తెలియడంతో ఎస్ఐ తీరు చూసి ముక్కున వేలేసుకున్నారు. ఎస్ఐ, రైటర్‌ను అదుపులోకి తీసుకున్న ఎసిబి అధికారులు సోమవారం సాయంత్రం హోంగార్డును నరసాపురం పట్టణంలోనే అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిని నరసాపురం టౌన్ పోలీసు స్టేషన్‌లో ఉంచి విచారిస్తున్నారు. అదే సమయంలో వీరు నివాసం ఉంటున్న గృహాల్లోనూ ఎసిబి అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో ఎసిబి సిఐ ఎన్‌వి.భాస్కర్‌రావు, సతీష్, ఏలూరు, రాజమంత్రి కార్యాలయాలకు చెందిన సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఎంఎల్‌సి వెంకటేశ్వరరావు

టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

తణుకురూరల్: పట్టణంలో అజ్జరం కాలనీలో నిలిచిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నిలిచిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి మాట్లాడుతూ తణుకు పట్టణ సమీపంలోని అజ్జరం కాలనీలో గత ప్రభుత్వ కాలంలో 2017-18లో రెండు బ్లాక్‌ల్లో 900 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసి, వీటి నిర్మాణ పనులను ఎల్‌అండ్‌టి కంపెనీకి అప్పగించారన్నారు. శ్లాబ్, గోడల నిర్మాణం చేశారన్నారు. వీటిలో కొన్ని నాలుగు ఫ్లోర్లు నిర్మించగా, మరికొన్ని రెండు ఫ్లోర్లతోనే ఆగిపోయాయన్నారు. ప్రభుత్వం మారడంతో నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. లబ్ధిదారులు బ్యాంకు లోన్ చెల్లించాలని బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారన్నారు. ఐదేళ్లుగా ఈ ప్రభుత్వం నిర్మాణాలను పట్టించుకోలేదని విమర్శించారు. వెంటనే ఈ టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో విఫలం : ఐద్వా

ప్రజాశక్తి - నరసాపురం

ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక మీరా స్మారక గ్రంథాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి పాల్గొన్నారు. పొగాకు పూర్ణ మాట్లాడుతూ మహిళలపై దాడులు అత్యాచారాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమయ్యాయన్నారు. రానున్న రోజుల్లో ఎన్నికలు వస్తున్నాయని మహిళలు చట్టాలు హక్కులు ఎవరైతే హామీలిచ్చి అమలు చేస్తారో వారికే తమ మద్దతు తెలిపారు. కళ్యాణి మాట్లాడుతూ ఉత్పత్తిలో సగభాగంగా ఉన్న మహిళలకు రక్షణ లేదన్నారు. తక్కువ కూలీతో శ్రమను దోచుకుంటున్నారన్నారు. అడ్డుకోవాల్సిన ప్రభుత్వమే వేడుక చూస్తోందని, 42 రోజుల అంగన్వాడీ సుదీర్ఘ సమ్మెకు కనీస వేతనం పెరగలేదని, ఫ్యాక్టరీల్లో షాపుల్లో తక్కువ వేతనానికి మహిళలు శ్రమను దోచుకుంటున్నారన్నారు. ఈ సభకు షేక్ బేగం అధ్యక్షత వహించారు. అంగన్వాడీ యూనియన్ తరపున నీలిమ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొగాకు పూర్ణ

ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం - ఎస్‌బిఐ బ్రాంచీల వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల బాండ్ల వివరాలు తక్షణం బహిర్గతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి వద్ద సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. గత నాలుగేళ్లలో అమ్మిన బాండ్లు, వాటిని కొన్నవారి సమస్త సమాచారాన్ని బహిర్గతం చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బిఐ విఫలమైందని విమర్శించారు. ఈ సమాచారాన్ని ఇవ్వడానికి ఎస్‌బిఐకి ఇచ్చిన మూడు వారాల గడువు ముగిసిందన్నారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని డిమాండ్ చేశారు. ఎస్‌బిఐ కార్యకలాపాలన్నింటినీ డిజిటలైజ్ చేసిందని, ఏ వివరాలు కావాలన్నా ఒక్క రోజులో ఇవ్వొచ్చునని తెలిపారు. ఎస్‌బిఐ ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను గడువులోపు ఇవ్వకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. మోడీ ప్రభుత్వ ఒత్తిళ్ల కారణంగానే ఎస్‌బిఐ జాప్యం చేస్తుందని చేస్తుందని ఆరోపించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, నేతలు ఎం.రామాంజనేయులు, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, త్రిమూర్తులు, ఒడుగు వెంకటేశ్వరరావు, ఇంజేటి శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.



భీమవరంలో ఎస్‌బిఐ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు



తాడేపల్లిగూడెంలో ఎస్‌బిఐ మార్కెట్ యార్డు బ్రాంచ్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

తాడేపల్లిగూడెం: అవినీతికి పరాకాష్టగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరి కన్పిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యాన స్థానిక ఎస్‌బిఐ మార్కెట్ యార్డు బ్రాంచి వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కర్రి నాగేశ్వరరావు, పట్టణ కమిటీ సభ్యులు కరెడ్ల రామకష్ణ,సిరపరపు రంగారావు లు హాజరై మాట్లాడుతూ,గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో పదహారు న్నర లక్షల కోట్ల రూపాయలు ఎన్నికల బాండ్లు రూపంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు జమ అయిన వివరాలు చెప్పాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను బిజెపి ప్రభుత్వం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తుంగలోకి తొక్కారని వారు అన్నారు.ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, గత నాలుగేళ్ల అమ్మిన బాండ్లు వాటిని కొన్న వారి సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలని, ఈసీ ఆ వివరాలు మార్చి 13 లోగా బహిర్గతపరచాలని సుప్రీంకోర్టు తీర్పులో ఆదేశించిందని వారు అన్నారు.సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విఫలమైందని, ఈ సమాచారాన్ని ఇవ్వడానికి ఎస్బిఐకి ఇచ్చిన మూడు వారాలు గడువు ముగిసిందని, ఆ వివరాలు వెల్లడవరచడానికి బదులు ఎస్బిఐ,గడువు ముగుస్తున్న సమయంలో మరో 116 రోజులు అదనపు గడువు కావాలని కోర్టును ఆశ్రయించిందని వారు అన్నారు.జూన్ 30 కల్లా కోరిన సమాచారం అంతా అందజేస్తామని తెలిపిందని వారు అన్నారు. తనకార్యకలాపాలు అన్నిటిని డిజిటల్ చేసిన ఎస్బిఐ ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను కొద్ది రోజుల్లో పొందుపరిచి ఇవ్వలేకపోయింది అంటే నమ్మశక్యంగా లేదని వారు అన్నారు.కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు లోనై వివరాలు ఇవ్వడంలో జాప్యం చేయకుండా ఇప్పటికైనా ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలు ఎస్బిఐ అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను,సత్తి కోదండ రామిరెడ్డి, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, నరమాల కష్ణ,మేట్రెడ్డి రమణ,పతివాడ నాగేంద్రబాబు,యడవల్లి వెంకట దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పోడూరు: కవిటం ఎస్‌బిఐ బ్రాంచి వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు బొంతు శ్రీను, కాకర వెంకటేశ్వర్లు, బూరాబత్తుల వెంకట్రావు, గుబ్బల రామస్వామి, దొంగ శ్రీను, ప్రకాశరావు పాల్గొన్నారు.

గణపవరం: సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పిప్పర స్టేట్‌బ్యాంక్ వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే తెలపాలని సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి మాట్లాడారు. ధర్నా అనంతరం బ్రాంచి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు పి.గోవింద్, ఎస్.సంజీవరావు, కె.శ్రీనివాస్, ఓ.మహేష్, ఎం.సూర్యారావు, ఎ.సతీష్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీరవాసరం: మండలంలోని కొణితివాడ ఎస్‌బిఐ బ్రాంచి వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి సిపిఎం సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో అయినంపూడి బాబూరావు, కేతా జ్యోతిబసు, లింగం సత్యనారాయణ, నున్నబోయిన సత్యనారాయణ, యాళ్లబండి నారాయణమూర్తి, గిద్దా శ్రీను, మైగాపుల త్రిమూర్తులు, పాలా కోటేశ్వరావు పాల్గొన్నారు.

నరసాపురం: స్థానిక ఎస్‌బిఐ వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి సిపిఎం నేత ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడగా నేతలు జల్లి రామ్మోహన్‌రావు, పొన్నాడ రాము, నోముల కొండ, తెలగంశెట్టి సత్యనారాయణ, నరేష్, కౌరు శ్రీనివాస్, మల్లుల లక్ష్మణ్, వి.రామలింగం, పి.వాసు పాల్గొన్నారు.

పాలకొల్లు: స్థానిక ఎస్‌బిఐ బ్రాంచి సిపిఎం నిర్వహించిన ధర్నానుద్దేశించి ఆ పార్టీ పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్.పురుషోత్తం, వై.అజయ్‌కుమార్, మల్లుల లక్ష్మీనారాయణ, గుబ్బల సత్యనారాయణ, తమ్మ సూర్యారావు, ఎర్ర కృష్ణారావు, చల్లా సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట: ఎన్నికల బాండ్ల వివరాలు తక్షణమే బహిర్గతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. ఆచంట ఎస్‌బిఐ బ్రాంచి వద్ద సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ఎల్.లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆచంట కచేరీ సెంటర్లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు ఎస్‌విఎన్.శర్మ, నరసింహమూర్తి, పరువు మోహన్‌రావు, వద్దిపర్తి అంజిబాబు, మచ్చ సుబ్బారావు, కుసుమ జయరాజు, తోటపల్లి సత్యనారాయణ, తలుపూరి బుల్లబ్బాయి, మానుకొండ రాంబాబు, సిర్రా విఘ్నేశ్వరుడు, అండ్రు సుబ్బారావు, బెనర్జీ పాల్గొన్నారు.

పెనుమంట్ర: సిపిఎం ఆధ్వర్యాన స్థానిక ఎస్‌బిఐ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నేత ఆకుల హరేరామ్ మాట్లాడారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, నేతలు బత్తుల విజయకుమార్, చింతపల్లి అప్పారావు, కుడిపూడి నాగేశ్వరరావు, గంటి ఆంజనేయులు, మల్లుల శ్రీనివాస్, వెంకటరాజు, శ్రీరామచంద్ర పాల్గొన్నారు.

పెంటపాడు: పెంటపాడు ఎస్‌బిఐ వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించి మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, నేత బంకురు నాగేశ్వరరావు మాట్లాడగా పెనగంటి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ఎస్‌బిఐ జాప్యం చేయడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. మోగల్లులోని ఎస్‌బిఐ బ్రాంచి వద్ద ధర్నా నిర్వహించి బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శేషపు అసిరియ్య, నేతలు దున్న మరియమ్మ, పాలా వెంకటచలపతి పాల్గొన్నారు.

పెనుగొండ: సిపిఎం ఆధ్వర్యాన ఎస్‌బిఐ బ్రాంచి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి సూర్నీడు వెంకటేశ్వరరావు మాట్లాడగా షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు, శీలం ఏసు, నీలాపు ఆదినారాయణ, బెల్లంకొండ భద్రరావు పాల్గొన్నారు. బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.

యలమంచిలి: సిపిఎం ఆధ్వర్యాన యలమంచిలి, ఏనుగువానిలంక ఎస్‌బిఐ బ్రాంచిల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఆయా బ్యాంక్ మేనేజర్లకు వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడగా కార్యక్రమంలో నేతలు బాతిరెడ్డి జార్జి, మాసవరపు సుబ్బారావు, దేవ సుధాకర్, సరిపల్లి జయప్రభ, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, సుగుణ, కోరం వెంకటేశ్వరరావు, లూథర్ బాబు, మల్లుల సత్యనారాయణ, మామిడిశెట్టి కృష్ణ, మల్లుల శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

ఆకివీడు: స్థానిక ఎస్‌బిఐ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన ధర్నానుద్దేశించి ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బి.రాంబాబు, షేక్ వలీ, కార్మికులు పాల్గొన్నారు.

తణుకురూరల్: ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే ఎస్‌బిఐ ప్రకటించాలని సిపిఎం ఆధ్వర్యాన ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు అడ్డగర్ల అజయకుమారి, కామన మునిస్వామి, పిఎల్ నరసింహారావు, నీలాపు ఆదినారాయణ, వై మందులయ్య, శ్రీ కృష్ణ పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలు త్వరగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో వచ్చిన ఫిర్యాదులను త్వరతగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలలా ప్రజల నుంచి వచ్చిన 253 వినతులను కలెక్టర్ స్వీకరించి మాట్లాడారు. జగనన్నకు చెబుదాం - స్పందనలో స్వీకరించిన అర్జీల పరిష్కారంపై తీసుకున్న చర్యలు అర్జీదారుల్లో సంతృప్తిని కలిగించేలా ఉండాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించడానికి ప్రాధాన్యతివ్వాలని ఆదేశించారు. స్పందనలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకూ చక్కని పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ బి.శివనారాయణ రెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టరు, గృహ నిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్ మాధుర్ పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి : కలెక్టర్

భీమవరం:ఎన్నికల నియమావళిని పట్టిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. జిల్లాలో ఇప్పటికే ప్రదర్శించిన వివిధ రాజకీయ పార్టీల ప్రచార సామగ్రిని ముందుగా గుర్తించి జాబితాను సిద్ధం చేయాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన 24 గంటల్లోపు ప్రభుత్వ ఆస్తులపై, 48 గంటల్లోపు ప్రయివేట్ ఆస్తులపై ఉన్న ప్రచార సామగ్రిని విధిగా తొలగించాలన్నారు. బ్యానర్లు, వాల్ పోస్టర్లు, పెయింటింగ్స్, విగ్రహాలు, ఫ్లెక్సీలు, జెండాలు, పాంప్లెట్స్, ఒక పార్టీని సూచించే రంగులు, ఫొటోలు తదితర ప్రచార సామగ్రిని గుర్తించి తొలగించాల్సి ఉందన్నారు. దేశ నాయకుల విగ్రహాలు తప్ప మిగతా అన్ని రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలను తెల్లటి వస్త్రంతో కప్పి ఉంచాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. జెసి ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ఇన్‌ఛార్జి డిఆర్ఒ బి.శివనారాయణ రెడ్డి, ఆచంట నియోజకవర్గ ఇఆర్ఒ వి.స్వామినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే అన్నీ నేర్పించాలి

ప్రజాశక్తి - తణుకు

విద్యార్థి స్థాయి నుంచే ప్రపంచ జ్ఞానం అందించడానికి విద్యా సంస్థలు కృషి చేయాలని తణుకు సిఐ ఎం.నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక నారాయణ పాఠశాలలో మోడల్ యునైటెడ్ నేషన్స్, మాస్టర్ ఆరేటర్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని 11 నారాయణ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ఒక్కో బ్రాంచి ఒక్కో దేశానికి సంబంధించిన అంశాలపై వివరణ ఇచ్చి వాటిపై డిబేట్ నిర్వహించినట్లు స్కూలు ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ తెలిపారు. మరో అతిథి ఎజిఎం పి.రామిరెడ్డి మాట్లాడుతూ వివిధ పోటీల్లో తమ విద్యార్థులను ప్రపంచస్థాయి పోటీల విజేతలుగా చేయడమే నారాయణ విద్యాసంస్థల లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ బి.కిరణ్‌కుమార్, ఆర్ఐవి.సురేష్, తూర్పు, పశ్చిమ కృష్ణ కర్నూలు జిల్లాలకు చెందిన ఆర్ఎస్‌టిలు పాల్గొన్నారు.

కొనసాగిన సీనియర్ ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - నరసాపురం

ఇంటర్ ద్వితీయ సంవత్సరం మాథ్స్-2 బి, జువాలజీ, హిస్టరీ పరీక్షలు సోమవారం జరిగాయి. నరసాపురంలో ఆదిత్య, వైన్ డైమండ్ జూబ్లీ, సూర్య, ఉమెన్స్, గౌతమి, భాస్కర కళాశాలలో పరీక్షలు జరిగాయి. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బిజిబిఎస్ ఉమెన్స్ కళాశాలలో 205 విద్యార్థులకు గాను 196 మంది పరీక్షలకు హాజరయ్యారు. 9 మంది గైర్హాజరయ్యారు.

ఉండి : యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో మ్యాథ్స్ 2 బికి సంబంధించి 131 మంది విద్యార్థులకు 128 మంది, జువాలజీకి సంబంధించి 30 మంది విద్యార్థులకు 30 మంది, హిస్టరీకి సంబంధించి నలుగురు విద్యార్థులకు ముగ్గురు, ఒకేషనల్ పరీక్షకు సంబంధించి 16 మందికి పూర్తిస్థాయిలో విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ పెద్దిరాజు తెలిపారు.

గత పాలకులకు ధీటుగా పనిచేయండి

ప్రజాశక్తి - ఉండి

గత పాలకులకు ధీటుగా పనిచేయాలని ఆలయ కమిటీ నూతన ఛైర్మన్ గాదిరాజు వెంకటరాజుకు పివిఎల్ నరసింహరాజు సూచించారు. సోమవారం వెలివర్రులోని వీర పేరంటాలమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఛైర్మన్ ఆఫీస్, ఫంక్షన్ షెడ్ల ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు పాల్గొని మాట్లాడారు. ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్లు కల్లేపల్లి సతీష్ రాజు, మంతెన రంగరాజు కంటే మిన్నగా నూతన ఛైర్మన్ ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ కల్లేపల్లి సతీష్‌రాజు మాట్లాడుతూ గత శాసనసభ్యులు ఇదే ఆలయం వద్ద గతంలో పివిఎల్ నరసింహరాజును అవమానించారని, అవమానించబడినచోటే పివిఎల్ గౌరవాన్ని పొందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ అచ్చారావు, ఎంపిటిసి కరణం త్రిమూర్తులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నరసాపురం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన స్థానిక కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, సంస్థ ఛైర్మన్ పి.విజయదుర్గ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో అన్ని పెండింగ్ సివిల్ కేసులు, రాజీ దగ్గ క్రిమినల్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ కేసులు, చెక్కు బాకీ కేసులు, మనోవర్తి కేసులు, అదనపు వరకట్న వేధింపుల కేసులు, చిట్ ఫండ్స్, ఫైనాన్స్ కంపెనీ కేసులు, బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ మొండి బాకీ తదితర కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. ఎక్సైజ్ కేసుల్లో కాంపౌండ్ ఫీజు కట్టి రాజీ పడొచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటే ఇరు పార్టీలు గెలిచినట్టేనని తెలిపారు. కక్షిదారులు తమ కేసులను ఈ నెల 16న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని విలువైన కాలాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవాలన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం : ఎంపిపి

ప్రజాశక్తి - ఆచంట

గ్రామాభివృద్ధే లక్ష్యంగా మండల ప్రజా పరిషత్ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. కరుగోరుమిల్లిలో జిల్లా ప్రజా పరిషత్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గ్రామంలో పలుచోట్ల ప్రజా పరిషత్ నిధులతో పిప్పరపల్లి వారి పాలెంలో గ్రావెల్ రోడ్ నిర్మాణం శెట్టిబలిజ వారి పాలెంలో కల్వర్టు నిర్మాణ పనులకు, కండెలవారి పేటలో పంట కాలువపై వంతెన, రేవు నిర్మాణానికి సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచి అల్లం పద్మావతి, సూర్యప్రకాష్‌రావు, ఉప సర్పంచి కొప్పిశెట్టి వరప్రసాద్, వార్డు మెంబర్లు సల్లాది పెద్దరాజు, పూర్ణావతి వెంకటేశ్వరరావు గంగాభవాని పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సి పరిధిలో నేషనల్ అయోడైజ్డ్ డిసీస్ కంట్రోల్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు అయోడిన్ లోపంతో వచ్చే లక్షణాలను డాక్టర్ ప్రతాప్ కుమార్ వివరించి పరీక్షలు నిర్వహించారు. సాధారణంగా అయోడిన్ లోపిస్తే థైరాయిడ్ గ్రంధిపై ప్రభావం చూపుతుందన్నారు. అలాగే గర్భిణులకు అయోడిన్ లోపించడం వల్ల పుట్టబోయే పిల్లల్లో మానసిక ఎదుగుదల ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, హెల్త్ అసిస్టెంట్ దివాకర్ బాబు, ఎంఎల్‌హెచ్‌పి మార్త పాల్గొన్నారు.

పశు సంరక్షణపై సమీక్ష

ప్రజాశక్తి - పాలకొల్లు

నూతనంగా నియమితులైన ఉద్యోగులు పశువులకు సేవ చేయడం అంటే రైతులకు సేవ చేయడం అని పాలకొల్లు పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర జి.మల్లేశ్వరరావు చెప్పారు. కొత్తగా నియమించిన ఎహెచ్ఎ పశు వైద్య సహాయకులతో ఆయన పశు వైద్యశాలలో సోమవారం సమీక్షించారు. పశువులకు వచ్చే సిజనల్ వ్యాధుల గురించి తెలుసుకోవాలని కోరారు.

మద్యం విక్రేతలు అరెస్టు

260 బాటిళ్లు, కారు, ఆటో స్వాధీనం

ప్రజాశక్తి - తణుకు

అరుణాచల్‌ప్రదేశ్ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని తణుకు పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి.మూర్తి, సిఐ నాగరాజు వివరాలు వెల్లడించారు. ఉండ్రాజవరం మండలం కర్రవారి సావరం చెందిన బోయిన బాలాజీని, రాజమహేంద్రవరంకు చెందిన తుమ్మల రాధాకృష్ణ గిరీష్ కుమార్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 260 మద్యం బాటిల్స్, కారు, ఆటో, రూ.ఆరువేల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ముద్దాయి బాలాజీ దుర వ్యసనాలకులోనై తన స్నేహితుడైన లారీ డ్రైవర్ పాపనాయుడు ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అక్కడ మద్యం తక్కువ ధరకు తెచ్చుకుని ఇక్కడ ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు వివరించారు. ఇరువురిపై పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. మాకా రాజేష్, గంధ్రోత్ ఏసుబాబు, పాపనాయుడు పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నిందితులను అరెస్ట్ చేయడంలో సహకరించిన ఎస్ఐ కె.శ్రీనివాస్, కానిస్టేబుల్ జి.శ్రీనివాస్, టి.రవి, షేక్ అక్బర్ లాల్, ప్రసాద్ వెలగేశ్వరరావు, శివాజీ, మురళిని డిఎస్‌పి మూర్తి, సిఐ నాగరాజు అభినందించారు.

పవన్ పోటీ ఎక్కడ..!



అందరిలో సర్వత్రా చర్చ
నిరుత్సాహంలో పార్టీ కేడర్, అభిమానులు
భీమవరం నుంచి తప్పుకున్న సేనాని
పిఠాపురం, గాజువాక స్థానాలపై గురి

ప్రజాశక్తి - భీమవరం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ ఎక్కడ నుంచి ఉంటుంది.. ఎంఎల్‌ఎగా పోటీ చేస్తారా లేక ఎంపీగా బరిలో ఉంటారా అనే ప్రశ్నలకు జనసేన కేడర్, అభిమానులు జవాబులు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జనసేనలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా జనసేనాని మాత్రం తన పోటీపై ఇప్పటివరకూ క్లారిటీ ఇవ్వకపోవడం పట్ల జన సైనికులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. పవన్ పోటీ చేసే స్థానంపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు పవన్ పోటీ చేసేందుకు 4 అసెంబ్లీ నియోజకవర్గాలపై పార్టీ నాయకులు దృష్టి సారించారు. తొలుత పవన్ భీమవరం నుంచి పోటీ చేస్తారని తెలుస్తుంది. దీనిలో భాగంగానే గత నెలలో భీమవరంలో పర్యటించిన ఆయన అక్కడ టిడిపి, బిజెపి, వైసిపి నేతలతో నేరుగా మంతనాలు సాగించారు. ఓటమి చెందిన చోటే గెలవాలని గట్టి సంకల్పంతో జనసేన కూడా ఉన్నారని దాదాపు ఎక్కడి నుంచే పోటీ చేస్తారని జోరుగా ప్రసారం సాగింది. అయితే అనూహ్యంగా పవన్ ప్లాన్ మార్చుకున్నారు. భీమవరంలో పదేళ్లపాటు ఎంఎల్‌ఎగా పనిచేసి ప్రస్తుతం టిడిపిలో ఉన్న అంజిబాబును జనసేనలోకి తీసుకురావడం పోటీ చేయించాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనిలో భాగంగానే భీమవరం నాయకులను మంగళగిరికి పిలిపించి ఇటీవల చర్చించారు. ఈ సమావేశాల్లో అంజిబాబు ఉండడంతో అంజిబాబు పోటీ దాదాపు ఖరారు కావడంతో పవన్ భీమవరం నుంచి తప్పుకున్నట్లు స్పష్టత వచ్చింది. ఇక, పిఠాపురం వైపు కూడా పవన్ చూస్తున్నట్లు తెలుస్తోంది. పిఠాపురంలో కాపు సామాజిక వర్గం ఓటు బ్యాంకు ఎక్కువగా ఉంది. ఇక్కడ నుంచి పోటీ చేస్తే బాగుంటుందని నేతలు సూచించారు. పవన్ కళ్యాణ్ కూడా సుముఖత వ్యక్తం చేశారు. మరోవైపు కాపు సామాజిక వర్గం మొత్తం పిఠాపురం నుంచి పవన్‌ను పోటీ చేయాలని లేఖలు రాస్తోంది. ఈ నేపథ్యంలో పవన్ జాబితాలో పిఠాపురం కూడా చేరింది.

గాజువాక ,తిరపతి నియోజకవర్గాలపై దృష్టి

విశాఖపట్నంలోని గాజువాకపైనా పవన్ దృష్టి పెట్టారని తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో గాజువాక నుంచి పోటీ చేసిన ఆయన దాదాపు 50 వేల ఓట్లు సాధించినప్పటికీ ఓటమిపాలయ్యారు. అయితే ప్రస్తుత పరిస్థితి దీనికి భిన్నంగా ఉండడం టిడిపి, జనసేన, బిజెపి కలయికతో గాజువాక జనసేనకు కంచుకోటగా మారింది. గాజువాకలో జనసేనకు దాదాపు 8 వేల మంది క్రియాశీలక కార్యకర్తలున్నారు. ఎన్నికల్లో పోల్ మేనేజ్‌మెంట్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లూ గాజువాకలో చేశారు. ఈ నేపథ్యంలో గాజువాక స్థానంపై జనసేన పూర్తిస్థాయిలో దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే పవన్‌కళ్యాణ్ మాత్రం దీనిపై ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. మరోవైపు తిరుపతి అసెంబ్లీ నుంచి పవన్ పోటీ చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీ అధినేత చిరంజీవి ఇక్కడ పోటీ చేసి గెలుపొందారు. కాబట్టి, మరోసారి మెగా కుటుంబం నుంచి తిరుపతిలో పోటీ చేయాలని స్థానిక నాయకులు కోరుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

సంక్షేమమే ధ్యేయంగా పాలన : ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పాలన జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం గొంది గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన బిసి కమ్యూనిటీ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రజల కోరిక మేరకు రూ.15 లక్షలు నిధులు కేటాయించి కమ్యూనిటీ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. గ్రామస్తులు చిన్న చిన్న శుభకార్యాలు, స్వయం సహాయక సంఘాలు సమావేశాలు నిర్వహించేందుకు ఈ భవనం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. 412 గడప ఉన్న ఈ గ్రామంలో ఐదేళ్లలో రూ.8.50 కోట్లు సంక్షేమ కార్యక్రమాలకు, రూ.2.35 కోట్లు అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు. నరసాపురం, పాలకొల్లు ప్రధాన రహదారి నుంచి చిట్టవరం గొంది ఆర్ అండ్ బి రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు దొంగ మురళీకృష్ణ, గ్రామ సర్పంచి మద్దాల శ్రీకృష్ణాంజనేయులు, కవూరు ధర్మారావు, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాటన్ పార్కు ప్రారంభం

మానసిక వికాసానికి పార్కులు దోహదపడతాయని రాష్ట్ర చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని 29వ వార్డు రైల్వే స్టేషన్ రోడ్డులో రూ.1.38 లక్షలతో నిర్మించిన కాటన్ పార్క్‌ను నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అందుబాటులోకి పార్క్‌ను తీసుకొచ్చామన్నారు. త్వరలోనే పార్కును ఆనుకుని గ్రంథాలయం కూడా నిర్మిస్తామన్నారు. మున్సిపల్ ఛైర్మన్ బర్రి శ్రీ వెంకట రమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, వైకేఎస్,కావాలి నాని పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ అంటే ముందుచూపుతో ఉండాలి : గ్రంధి

ప్రజాశక్తి - వీరవాసరం

ఎంఎల్‌ఎ ముందుచూపుతో ఆలోచించకపోతే దాని ఫలితం ప్రజలు అనుభవించాల్సి వస్తుందని భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పెర్కిపాలెం, మెంటేపూడి గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పెర్కిపాలెంలో అంగన్‌వాడీ భవనంతో పాటు రూ.46.84 లక్షలతో జలజీవన్ మిషన్‌లో నిర్మించనున్న ఓవర్‌హెడ్ ట్యాంకుకు శంకుస్థాపన చేశారు. ఇదే పథకంలో మెంటేపూడిలో రూ.36 లక్షలతో నిర్మించిన నలభై వేల లీటర్ల ఓవర్‌హెచ్ ట్యాంకును ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా పెర్కిపాలెం జగనన్న కాలనీ గుండా జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వెళ్తుందన్న విషయాన్ని లబ్ధిదారులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించారు. ప్రస్తుతం అటువంటిదేమీ లేదని ఆందోళన చెందొద్దని ధైర్యంగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. బైపాస్ రోడ్డు విషయం అప్పటి ఎంఎల్‌ఎ ముందు చూపు లేకపోవడం వల్లే ఇటువంటి పరిస్థితులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కందుల వెంకటేశ్వరరావు, కొల్లా సుధాకృష్ణకుమారి, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ పాల్గొన్నారు.

బీమా నగదు చెల్లింపు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెంటపాడు మండలం ఆకుతీగపాడు గ్రామానికి చెందిన కొండేటి సువర్ణరాజు ఇటీవల మరణించడంతో ఆయన తీసుకున్న లక్ష రూపాయల గ్రామీణ తపాలా జీవిత బీమాకు సంబంధించిన క్లెయిమ్ సొమ్ము 1,17,111 రూపాయలు నామిని అయిన కొండేటి దీనమ్మకు తాడేపల్లిగూడెం పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సువర్ణరాజు ఒక ప్రీమియం రూ.13,430 మాత్రమే చెల్లించారని, అన్ని ఇతర ఇన్సూరెన్స్ కంపెనీల కంటే తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ ఈ గ్రామీణ తపాలా జీవిత బీమాలో లభిస్తుందన్నారు. పది వేల నుంచి లక్ష రూపాయలు వరకూ చేసుకోవచ్చని తెలిపారు. బీమా సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ముత్యాల రాజు, బ్రాంచి పోస్టు మాస్టార్ జి.కృష్ణా, సర్పంచి వెంకటేశ్వర్లు, కార్యదర్శి నాగదేవి పాల్గొన్నారు.

ఉపాధి పనులు చూపాలని ధర్నా

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలో ఉపాధి పనులు చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి షేక్ పాదుషా అన్నారు. సోమవారం అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఉపాధి పనుల సాంకేతిక నిపుణుడు శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో వ్యవసాయ కూలీలకు రెండు నెలలుగా పనులు లేకుండా పోయాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు ఉపాధి నిధులను పక్కదారి పట్టించి నీరుగారుస్తున్నారని తెలిపారు. తక్షణం అధికారులు మండలంలో ఉపాధి పనులు చేపట్టడానికి అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కార్మికులు పూతినీడి పద్మ, సంఘం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, శీలం ఏసు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - ఉండి

అభివద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. సోమవారం ఉండి మండల కేంద్రంలో ఆంధ్రా బ్యాంకు నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిలోని చిన్న వంతెన శిథిలావస్థకు చేరింది. గతంలో శిథిలావస్థకు చేరిన చిన్న వంతెన శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు ప్రభుత్వం స్పందించి వంతెన పునర్నిర్మాణానికి నిధులు కేటాయించడంతో సోమవారం పివిఎల్, ఎంపిటిసి కునుకు రమాదేవి శ్రీనివాస్, ఉపసర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్ పనులకు శ్రీకారం చుట్టారు. గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా కేటాయించిన నిధుల్లో రూ.10 లక్షలు వంతెన పునర్నిర్మాణానికి ఉపయోగించగా, మరో రూ.10 లక్షలు కాపులపేటలో, కొండ్రోతుపేటలోని సీసీ రోడ్ల అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, నాయకులు పాల్గొన్నారు.

వైసిపివి కుయుక్తులు : పితాని

ప్రజాశక్తి - ఆచంట, (పెనుమంట్ర)

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండగా వైసిపి కుయుత్తులకు పాల్పడుతోందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. పెనుమంట్ర మండలం నెలమూరులో ఇంటింటి పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ వాలంటీర్లతో అక్రమంగా సర్వే చేస్తున్నారని, జగనన్నే మళ్లీ రావాలని బయోమెట్రిక్‌లు వేయాలంటూ హుకుం జారీ చేయటం దుర్మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ గౌరవాధ్యక్షులు పిల్లి సత్తిరాజు, నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, నేతలు పాల్గొన్నారు.

పాలకొల్లు సంక్షేమంలో ముందుండాలి : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల కంటే అభివృద్ధి సంక్షేమంలో ముందుండాలని, దీనికోసం 365 రోజులు కష్టపడి పని చేస్తున్నానని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆయన కార్యాలయంలో సోమవారం పలువురు యువతకు క్రికెట్ వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాలు పాలకొల్లులో పూర్తి చేయాలని డిమాండ్‌ను సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లేందుకు తాను మండుటెండలో 240 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణం చేసినట్లు చెప్పారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - నరసాపురం

వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా మహిళలు మరింత ఆర్థికంగా బలపడాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. నరసాపురం నియోజకవర్గ స్థాయిలో సోమవారం రుస్తుంబాద సెవెంత్ డే కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన నాలుగో విడత వైఎస్ఆర్ చేయూత కార్యక్రమానికి ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోరి వారికి అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఒక్క నాలుగో విడత చేయూత పథకం కింద 9714 మంది మహిళలకు రూ.18.24, కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమాని నాగరాజు, ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - మొగల్తూరు

అంగన్వాడీ సిబ్బంది పౌష్టికాహారంపై అవగాహన ప్రదర్శన చేశారు. పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా సోమవారం మొగల్తూరు పంచాయతీ కుక్కల వారి తోట, ఆదర్శనగర్ కాలనీలో పౌష్టికాహారం తీసుకుంటే కలిగే లాభాలు వివరించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘాన్ని పటిష్టం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సమస్యల పరిష్కారం కోసం భవన నిర్మాణ కార్మికులు సంఘాన్ని పటిష్టం చేసుకోవాలని, ఈ నెల 15వ తేదీన తణుకులో జరగనున్న జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం 6వ మహాసభల కరపత్రాలను సిపాయిపేట భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడారు. కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఏరియా తాపీ వడ్రంగి సెంటరింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దువ్వా శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లెలో నూతనంగా నిర్మించిన శ్మశానవాటికను డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు ప్రారంభించారు. సోమవారం కోపల్లె గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. తూర్పుపేటలో ఓపెన్ డ్రెయినేజీను, పసలకోనేరు సమీపాన మండల ప్రజాపరిషత్ సహాయ నిధులు సుమారు రూ.3 లక్షలతో సీసీ రోడ్డును ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి వెళ్లే రోడ్డులో జిల్లా ప్రజా పరిషత్ సహాయ నిధులతో రూ.20 లక్షలతో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాధరాజు, జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, దంతులూరి కోటేశ్వరరాజు, మన్నే నాగరాజు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులను నియమించాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి స్థాయికి అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని ఎపి మెడికల్ ఎంప్లాయీస్ అండ్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షులు కోనాల బీమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆసుపత్రి ఆవరణలో ఎపి మెడికల్ ఎంప్లాయీస్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీమారావు మాట్లాడుతూ 150 పడకల జిల్లా ప్రభుత్వాసుపత్రి స్థాయికనుగుణంగా 120 మంది పారిశుధ్య కార్మికులను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు ధర్మాని పుష్పలత, ఎం.వెంకటలక్ష్మి, వై.రత్నం, వి.సూరమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధిలో గ్రామీణ పరిపాలన కీలకం

ప్రజాశక్తి - పాలకోడేరు



సర్పంచి, ఎంపిటిసిని సత్కరిస్తున్న ఎంపిపి, తహశీల్దార్

అభివృద్ధిలో గ్రామీణ పరిపాలన ఎంతో కీలకమని తహశీల్దార్ కె.నాగార్జున, ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) అన్నారు. వేంద్ర సచివాలయ భవనాన్ని ఇటీవల రూ.40 లక్షలతో నిర్మించారు. దీనిలో భాగంగా పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యులను, ఎంపిటిసిలను ఎంపిపి చంటిరాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవ చేయడంలో ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కడలి నాగేశ్వరి, కడలి విజయలక్ష్మి, చింతపల్లి వెంకటనారాయణ (చిన్న), ఎంపిటిసి పాల జ్యోతి, ఆర్ఐ నాగభూషణం నాయుడు, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి ఎ.పోలయ్య పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీకి శ్రద్ధ తీసుకోవాలి

జెసి రామ్ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్లు లబ్ధిదారులకు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జెసి ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్లో సివిల్ సప్లై అధికారులు, ఆయిల్ కంపెనీ సేల్స్ అధికారులతో ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్లపై జిల్లా జాయింటు కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 28,885 మంది లబ్ధిదారుల నుండి దరఖాస్తులు సేకరించడం జరిగిందన్నారు. దీనిలో అర్హులైన 25,689 లబ్ధిదారులను గుర్తించి వారిలో ఇప్పటివరకు 22,124 మంది లబ్ధిదారులకు ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్ అందచేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిఎస్ఒ ఎన్.సరోజ, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, హెచ్ పిసిఎల్ సేల్స్ అధికారి జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సూర్యారావును పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

సూర్యారావుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పరామర్శ

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు కేతా సూర్యారావు మనవడు కేతా లెనిన్ అనారోగ్య సమస్యతో ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూర్యారావును పరామర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, విజయకుమార్, కె.క్రాంతిబాబు, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, ఐద్వా జిల్లా నాయకురాలు సరిపల్లి జయప్రభ, నాయకులు ఎం.ఆంజనేయులు, చెట్టిమి భాస్కరరావు, తెన్నేటి స్టాలిన్, గోగినేని శ్రీనివాస్, ముమ్మిడివరపు ఈశ్వరుడు, పల్లేరు వెంకటస్వామి, కేతా వాసు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఉన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

స్పందన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ అధికారులను ఆదేశించారు. నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 36 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన ఆర్‌డిఒ వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఓటు వజ్రాయుధం వంటిదని నిట్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ జిబి వీరేష్‌కుమార్ తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎపి నిట్)లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సోమవారం సాయంత్రం ఆయన ఓటు హక్కుపై ఆవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైందన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటేనని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని చెప్పారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పెనుగొండ

మంచి ఆహారపు అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డాక్టర్ సిహెచ్ సులక్షణమణి తెలిపారు. వడలిలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం సోమవారం మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రస్తుతం అందరూ ఫాస్ట్ ఫుడ్స్ అంటూ ఇంటిలో వంటలకు దూరమై ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. మంచి ఆహారపు అలవాట్లు వల్ల మంచి ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఆర్ఎన్ శ్రీనివాసు, టి.దివాకర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహనుండాలి

మొగల్తూరు:ప్రకృతి వ్యవసాయం పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆ శాఖ సిబ్బంది సూచించారు. సోమవారం మొగల్తూరులోని నవధాన్య రథసారథులు కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ శాఖ, అంగన్వాడీ సిబ్బంది సంయుక్తంగా అవగాహన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడారు. ఇంటి పెరటిలో, అంగన్వాడీ కేంద్రాల ఆవరణలో, కూరగాయలు పండించాలన్నారు. ఎరువులు వాడకుండా పండించిన కూరగాయలతో ప్రజల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కె.లక్ష్మీకుమారి, టి.పుష్ప, పి.రామలక్ష్మి, కనకదుర్గ, భవాని పాల్గొన్నారు.